మోసం చేస్తేనే భోజనం!

కంబోడియా చీకటిగదుల్లో చిత్రహింసలు

- డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాల పేరిట కంబోడియా దేశానికి తీసుకెళ్తున్న ఏజెంట్లు
- భారత్‌లో సైబర్ నేరాలకు పాల్పడేలా శిక్షణ
- మత్తు ఇంజెక్షన్లు, బేస్‌బాల్ బ్యాట్లతో దాడులు
- ఆ దేశంలో చిక్కుకున్న బయ్యారం యువకుడు
- ఇండియన్ ఎంబసీ ఆధీనంలో బాధితుడు: ఎస్పీ

ప్రకాశ్‌కోసం ఆందోళన చెందుతున్న కుటుంబసభ్యులు, ఇన్‌సెట్లో ప్రకాశ్ (ఫైల్)

బయ్యారం, మే 27: డాటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగాలు.. భారీగా వేతనాలు.. అంటూ కొందరు ఏజెంట్లు భారతీయ నిరుద్యోగులను నమ్మిస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి లక్షన్నర వరకు తీసుకొని కంబోడియాకు పంపిస్తున్నారు. అక్కడ చైనా, కంబోడియా కంపెనీల ఏజెంట్లు భారతీయులే లక్ష్యంగా సైబర్ నేరాలకు పాల్పడటంపై 7-10 రోజులపాటు వీరికి శిక్షణ ఇప్పిస్తారు. అనంతరం బెట్టింగ్, సైబర్ మోసాలపై ఒక్కొక్కరికి భారీ టార్గెట్లు విధిస్తారు. లక్ష్యాన్ని చేరితే రెండుపూటలా భోజనం పెడతారు. ఈ క్రమంలో బాధితులు తిరస్కరించినా, ఎదురుతిరిగినా, టార్గెట్ చేరకపోయినా దాడులకు దిగుతారు. ఒక్కపూటే అన్నం పెడతారు. చీకటి గదుల్లో వేసి చిత్రహింసలు పెడతారు. మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి బేస్‌బాల్ బాట్లతో విపరీతంగా కొడతారు.

5000 మందికిపైగా భారతీయులు

ఇప్పటివరకు 5000 మందికిపైగా భారతీయులు చైనా ఏజెంట్ల వలలో చిక్కి కంబోడియాకు చేరినట్టు అంచనా. అక్కడ ఒక్క ఏపీ వారే 150 మంది చిక్కుకోగా, ఇటీవలే 58 మంది విశాఖకు తిరిగి చేరుకున్నారు. మిగతా వారిని తీసుకొచ్చేందుకు ఏపీ సర్కారు భారత ఎంబసీతో సంప్రదింపులు జరుపుతున్నది. కంబోడియా కేంద్రంగా కొందరు ఏజెంట్లు భారతీయులను సైబర్ ఉచ్చులో దింపి నగదు లాగేస్తున్నారు. పెద్ద మొత్తం నగదు గుంజి వివిధ బ్యాంకు ఖాతాలకు మళ్లిస్తూ క్రిప్టో కరెన్సీగా మారుస్తున్నారు. కొందరు ఏడాదిగా, మరికొందరు ఆరు నెలలుగా, ఇంకొందరు మూడు నెలలుగా కంబోడియాలో పనిచేస్తున్నారు. తెలంగాణ యువకుడు కూడా కంబోడియా ఏజెంట్ల చేతిలో చిక్కి చిత్ర హింసలకు గురయ్యాడు. ప్రస్తుతం అతడు భారత ఎంబసీ అధికారులు ఆధీనంలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు.

ప్రకాశ్ ఒంటిపై గాయాలు

15 రోజులుగా చిత్రహింసలు

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేటకు చెందిన మున్సుఫ్ ప్రకాశ్ బీటెక్ పూర్తి చేసి మూడేండ్లు హైదరాబాద్‌లోని ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేశాడు. మార్చి 8న ఓ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా ఉద్యోగం కోసం ఆస్ట్రేలియా వెళ్తున్నట్టు కుటుంబసభ్యులకు చెప్పాడు. ఆ ఏజెన్సీ వారు ఆస్ట్రేలియా కాకుండా మలేషియాకు తీసుకువెళ్లారు. అక్కడ రెండు నెలలపాటు బాగానే ఉన్నాడు. ఇంటికి ఫోన్ చేసి కుటుంబసభ్యులతో మాట్లాడుతుండేవాడు. 15 రోజుల క్రితం ప్రకాశ్‌ను కంబోడియాకు తీసుకెళ్లారు. బెట్టింగ్ మోసంపై శిక్షణ ఇచ్చారు. ఫోన్‌కాల్స్ చేసి బెట్టింగ్ పెట్టించేలా టార్గెట్లు ఇచ్చారు. లేకుంటే చిత్రహింసలు పెట్టారు. అతడితోపాటు మరికొందరు యువకులు, యువతులు కూడా ఉన్నారు. ఈ హింసలు తట్టుకోలేక పోతున్నానని తన అన్న ప్రశాంత్‌కు కొన్ని రోజులుగా ఫోన్ చేసి ఆవేదనను వెలిబుచ్చాడు. గాయాల వీడియోలు కూడా పెట్టాడు. ఏం చేయాలో తెలియని కుటుంబసభ్యులు.. ప్రభుత్వం చొరవ తీసుకొని ప్రకాశ్‌ను వెనక్కి వచ్చేలా కృషి చేయాలని వేడుకుంటున్నారు. ప్రకాశ్ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ సోమవారం స్పందించారు. ఇండియన్ ఎంబసీ అధికారులతో మాట్లాడినట్టు, ప్రకాశ్ క్షేమంగా ఉన్నాడనే సమాచారాన్ని కుటుంబసభ్యులకు వెల్లడించినట్టు తెలిపారు. ఎంబసీ అధికారులు ప్రకాశ్‌ను ఇండియాకు పంపించనున్నట్టు పేర్కొన్నారు.

40 ఏండ్ల కిత్రం తెలంగాణకు వలస..

కంబోడియా దేశంలో చిత్రహింసలు అనుభవిస్తున్న ప్రకాశ్ కుటుంబం తమిళనాడు నుంచి 40 ఏండ్ల క్రితం తెలంగాణకు వలస వచ్చింది. ఇక్కడే డబల్ రొట్టెలు, పాపడాలు తయారు చేస్తూ స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. ప్రకాశ్ తల్లి విజయ పదేండ్ల క్రితం, తండ్రి రాజు నాలుగేండ్ల క్రితం చనిపోయారు. అన్న ప్రశాంత్ పెట్రోల్ బంకులో పనిచేస్తున్నాడు. కుటుంబ పోషణ భారంగా మారడంతో ప్రకాశ్ హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగం చేశాడు.

బువ్వ కోసం ఠాణా మెట్లెక్కిన అవ్వ

- అమీన్ సాబ్‌తో 85 ఏండ్ల వృద్ధురాలి మొర
- తల్లి పోషణను పట్టించుకోని కన్నకొడుకులు

గణపతి కృష్ణమ్మ

పాలకుర్తి, మే 27: బుక్కెడు బువ్వ కోసం ఠాణా మెట్లెక్కింది ఓ అవ్వ. తన భర్తతో కలిసి యుక్త వయసులో సంపాదించిన ఆస్తులన్నింటినీ కొడుకుల పేర చేసి ఇప్పుడు అనాథ అయ్యింది. కొడుకులు, కోడండ్లు ఉన్నా.. చేతకాని వయసులో తనకు ఆకలి బాధ తప్పడం లేదని అమీన్ సాబ్ ఎదుట వాపోయింది. 'నా కన్నకొడుకులతో నాకు బుక్కెడు బువ్వ పెట్టించండి.. బాంచెన్ మీ కాల్మొక్తా..' అంటూ వేడుకున్నది. ఓ పండు ముసలి కాలే కడుపు పట్టుకుని మండుటెండలో ఠాణా మెట్లెక్కిన ఘటన పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. 'నా పేరు గణపతి కృష్ణమ్మ. నా వయస్సు 85 ఏండ్లు ఉంటది. మాది పాలకుర్తి మండలం కన్నాల గ్రామం. నాకు నలుగురు కొడుకులు, కూతురు ఉంది. అందరికీ పెండ్లీలు అయ్యి.. వేర్వేరుగా ఉంటున్నారు. నా పెనిమిటి, నేను సంపాదించిన కోట్ల విలువైన ఆస్తులన్నీ నా కొడుకులు పంచుకున్నరు. నా పెనిమిటి కొన్నేండ్ల క్రితం కాలం చేసిండు. అప్పటి నుంచి వంతుల వారీగా సాకిన నా కొడుకులు.. ఇప్పుడు దిక్కులేని దాన్ని చేసిండ్రు. అడుక్కుతినే దానిలా చూస్తున్నరు' అంటూ సోమవారం ఠాణాకు వచ్చిన ఆ పండు ముసలి ఎస్సైలు స్వామి, శివాణిరెడ్డి ఎదుట కన్నీరు పెట్టుకున్నది. తర్వాత ఎస్సై శివాణిరెడ్డి కృష్ణమ్మ కొడుకులను ఠాణాకు పిలిపించారు. వారితో మాట్లాడి కన్నతల్లి పోషణను బాధ్యతగా తీసుకోవాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): బాసర ఆర్జీయూకేటీలో ఐదేండ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ కోర్సుల్లో ప్రవేశాల నోటిఫికేషన్ సోమవారం విడుదలైంది. జూన్ 1 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ వీ వెంకటరమణ తెలిపారు. బాసరలోని ఆర్జీయూకేటీలో మొత్తం 1500 సీట్లున్నాయి. పదో తరగతిలో విద్యార్థులు సాధించిన జీపీఏ ఆధారంగా సీట్లు భర్తీచేస్తారు. ఈ ఏడాది దరఖాస్తు విధానాన్ని ఎస్సెస్సీ బోర్డు సర్వర్‌తో అనుసంధానించారు. దీంతో విద్యార్థి హాల్‌టికెట్ నెంబర్, పేరు వంటి వివరాలు నమోదుచేయగానే ఆటోమెటిక్‌గా వివరాలు ప్రత్యక్షమవుతాయి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.450, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.500 దరఖాస్తు ఫీజుగా చెల్లించాలని వెంకటరమణ తెలిపారు. వివరాల కోసం www.rgukt.ac. in వెబ్‌సైట్‌ను, 7416305245, 7416058245, 7416929245 హెల్ప్‌లైన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

షెడ్యూల్	
ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ	1-6-24
దరఖాస్తుకు తుది గడువు	22-6-24
స్పెషల్ క్యాటగిరీ విద్యార్థులు డౌన్‌లోడ్‌చేసిన దరఖాస్తులను సమర్పించేందుకు గడువు	29-6-24
ప్రొవిజినల్ సీట్ల కేటాయింపు (స్పెషల్ కేటగిరీ కాకుండా)	03-07-24
సర్టిఫికెట్ వెరిఫికేషన్	08-7-24

జూన్ 3 నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): పదోతరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 3 నుంచి 13 వరకు నిర్వహించనున్నట్టు ఎస్సెస్సీబోర్డు ప్రకటించింది. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు 170 పరీక్షాకేంద్రాల్లో నిర్వహించనున్న పరీక్షలకు 51,237 విద్యార్థులు హాజరుకానున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా రోజులకు భిన్నంగా ఫస్ట్ లాంగ్వేజ్(కంపోజిట్ కోర్సు)ను ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:50 వరకు, సైన్స్ పేపర్లకు ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు పరీక్షలుంటాయని పేర్కొన్నారు. వివరాల కోసం 040 -23230942 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి గురుకుల దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, మే27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ పరిధిలోని ఇంటర్ గురుకుల కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నదని అధికారులు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. 2024లో పదోతరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు 31లోగా ఆన్‌లైన్ ద్వారా రూ.100 ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పదోతరగతిలో వచ్చిన జీపీఏ ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్టు వివరించారు.

బధిరుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు

హైదరాబాద్, మే27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వ దివ్యాంగుల సాధికారతశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మలక్‌పేట బధిరుల ఆశ్రమ పాఠశాల (చెవిటి)లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. పాఠశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వివరాల కోసం 9440362946, 9490942597 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

టీజీఎస్‌ఆర్టీసీ ఐటీఐ కళాశాలల్లో ప్రవేశాలు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్, వరంగల్‌లోని టీజీఎస్‌ఆర్టీసీ ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడ్‌లలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు టీజీఎస్‌ఆర్టీసీ తెలిపింది. అర్హత కలిగిన విద్యార్థులు జూన్ 10లోపు ఆన్‌లైన్ (http//iti.telangana.gov.in)ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మోటార్‌మెకానిక్ వెహికిల్, మెకానికల్‌డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో ప్రవేశాలు జరుగుతున్నట్టు తెలిపింది. ప్రవేశం పొందిన విద్యార్థులకు కోరుకున్న టీజీఎస్‌ఆర్టీసీ డిపోల్లో అప్రెంటిస్‌షిప్ సౌకర్యం కల్పిస్తున్నట్టు పేర్కొంది. వివరాల కోసం హైదరాబాద్ ఐటీఐ కళాశాల ఫోన్ నంబర్లు 9100664452, 040-23450033, వరంగల్ ఐటీఐ కళాశాల ఫోన్‌నంబర్లు 9849425319, 8008136611ను సంప్రదించాలని తెలిపింది. పూర్తివివరాలను http//iti.telangana.gov.in వెబ్‌సైట్‌లోనూ చూడొచ్చని పేర్కొంది.

1,739 ప్రభుత్వ బడుల్లో నమోదు సున్నా

- గత ఏడాది జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్ల సంఖ్య 1,307
- ఏటా తగ్గుతున్న విద్యార్థుల నమోదు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలోని సర్కారు బడుల్లో విద్యార్థుల నమోదు తగ్గుతుంది. ఏటా నమోదు గణనీయంగా పడిపోతుంది. విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లపై మోజుపై సర్కార్ బడుల్లో చేరేవారు కరువయ్యారు. అటు తల్లిదండ్రులు, ఇటు విద్యార్థుల్లో సర్కారు బడుల పట్ల నమ్మకం సన్నగిల్లుతున్నది. మరీ ముఖ్యంగా ప్రైమరీ స్కూళ్లు దారుణ పరిస్థితుల్లో ఉన్నాయి. పలు ప్రాంతాల్లో విద్యార్థులు చేరక మూసివేత దిశలో సాగుతున్నాయి. ఈ విద్యాసంవత్సరంలో జీరో ఎన్‌రోల్‌మెంట్ బడులు అక్షరాలా 1,739. నిరుడుతో పోల్చితే ఈ విద్యాసంవత్సరంలో కొత్తగా 432 స్కూళ్లల్లో నమోదు సున్నా. ఒక్కరంటే ఒక్కరు కూడా ఈ బడుల్లో చేరలేదు. సర్కారు బడుల్లో మొత్తం 23 లక్షల మంది విద్యార్థులుండగా, ఈ ఏడాదికి వచ్చేసరికి 20 లక్షలకు పడిపోయింది. అంటే ఈ ఏడాది కాలంలో మూడులక్షల విద్యార్థులు తగ్గిపోయారు. బడిబాట వంటి కార్యక్రమాలను నిర్వహించినా ఫలితాలు రావడంలేదు. నమోదు పెరగడంలేదు.

యాజమాన్యాల వారీగా నమోదు ఇలా

యాజమాన్యం	నమోదు శాతం	బడుల శాతం
సర్కారు బడులు	34.41	65.5
గురుకులాలు	7.78	3.02
సంక్షేమ డే స్కాలర్ స్కూళ్లు	0.36	3.49
అంధులు, బధిర, స్పోర్ట్స్	0.02	0.02
కేంద్ర ప్రభుత్వ స్కూళ్లు	0.12	0.02
ఎయిడెడ్	1.15	1.55
ప్రైవేట్ స్కూళ్లు	56.16	26.4

రేపటి నుంచి 'పీఈటీ' సర్టిఫికెట్ వెరిఫికేషన్

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో పీఈటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు బుధవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. జూన్ 4వరకు రోజూ రెండు సెషన్లలో వంద మంది చొప్పున వెరిఫికేషన్ కొనసాగుతుందని వెల్లడించింది. వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించింది.

మస్క్ ఎక్స్‌ఏఐ నుంచి సూపర్ కంప్యూటర్

న్యూఢిల్లీ, మే 27: తన ఏఐ స్టార్టప్ ఎక్స్‌ఏఐ ద్వారా సూపర్ కంప్యూటర్ తయారు చేయాలని సంకల్పించినట్టు టెక్ దిగ్గజం, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఈ నెలలో ఇన్వెస్టర్లకు వెల్లడించారు. ఈ అడ్వాన్స్‌డ్ సూపర్ కంప్యూటర్ నెట్స్ జనరేషన్ ఏఐ చాట్‌బాట్, గ్రోక్‌లను మళ్లీ తయారు చేసినట్టుగా ఉంటుందని మస్క్ తెలిపారు. 2025 ఆఖరులోగా ఈ సూపర్ కంప్యూటర్‌ను ఆపరేట్ చేయాలని వెల్లడించారు. ఈ సూపర్ కంప్యూటర్‌ను హెచ్100 గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లతో తయారు చేయాలని.. ప్రస్తుతమున్న సూపర్ కంప్యూటర్ల కంటే ఇది నాలుగు రెట్లు పెద్దదిగా ఉంటుందని చెప్పారు.

ఏసీబీకి చిక్కిన ఏవో

- మారుతి ట్రేడర్స్ రెన్యూవల్ కోసం లంచం డిమాండ్
- రూ.38 వేలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు

వంశీకృష్ణ

దహెగాం, మే 27: ట్రేడర్స్ రెన్యూవల్ కోసం లంచం తీసుకుంటున్న మండల వ్యవసాయాధికారిని ఏబీసీ అధికారులు సోమవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు ఏబీసీ డీఎస్పీ రమణమూర్తి మీడియాకు వివరాలు వెల్లడించారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం అయినం గ్రామంలోని మారుతి ట్రేడర్స్ (ఫర్టిలైజర్ అండ్ సీడ్స్) దుకాణం రెన్యూవల్ కోసం యజమాని చౌదరి శ్యాంరావు గత నెల 27న ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నాడు. రెన్యూవల్ కాకపోవడంతో మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణను సంప్రదించాడు. ఫర్టిలైజర్ దుకాణానికి రూ.20 వేలు, సీడ్స్ షాపునకు రూ.18 వేలు లంచం ఇస్తేనే రెన్యూవల్ చేస్తానని ఏవో చెప్పాడు. చేసేది లేక శ్యాంరావు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. వారి ప్లాన్ ప్రకారం.. సోమవారం శ్యాంరావు ఏవోకు ఫోన్ చేసి డబ్బులు ఇస్తానని, ఎక్కడికి రమ్మంటారని అడిగాడు. దహెగాంలోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో ఉన్నానని చెప్పగా.. శ్యాంరావు డబ్బులతో అక్కడికి వెళ్లాడు. మొదట తన షాపు రెన్యూవల్‌కు సంబంధించిన రికార్డులపై సంతకాలు చేయించుకున్న తర్వాత ఏవోకు రూ.38 వేలు అందించాడు. ఆ డబ్బులతో తన కారులో వస్తున్న ఏవోను ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి ఆధ్వర్యంలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నగదును స్వాధీనం చేసుకున్నారు.

కవిత అరెస్టు అక్రమం

- అప్రూవర్ల ఆరోపణలతో తప్పుడు కేసు బనాయించారు
- విచారణ, అరెస్టు విషయంలో సీబీఐ తీరు చట్టవిరుద్ధం
- ఢిల్లీ హైకోర్టులో కవిత తరపు న్యాయవాది వాదనలు
- నేడు సీబీఐ, ఈడీ వాదనలు విననున్న న్యాయస్థానం

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): ఢిల్లీ మద్యం పాలసీ వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కేంద్ర దర్యాప్తు సంస్థలు అక్రమంగా అరెస్ట్ చేశాయని, కేవలం ఒక అప్రూవర్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), సీబీఐ తప్పుడు కేసులు పెట్టి, అదుపులోకి తీసుకున్నాయని ఆమె తరఫు న్యాయవాది ఢిల్లీ హైకోర్టుకు నివేదించారు. ఈ కేసుల్లో బెయిలు మంజూరు చేయాలని కోరడంతోపాటు తన అరెస్టు కోసం సీబీఐకి దిగువ కోర్టు అనుమతి ఇవ్వడాన్ని, కస్టడీని సవాలు చేస్తూ కవిత వేర్వేరుగా దాఖలు చేసుకున్న పిటిషన్లపై జస్టిస్ స్వర్ణకాంత శర్మ సోమవారం దాదాపు 45 నిమిషాలపాటు సుదీర్ఘ విచారణ జరిపారు. కవిత తరపున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదన వినిపిస్తూ.. సీబీఐ, ఈడీ విచారణకు కవిత సహకరించినప్పటికీ ఆమెను అక్రమంగా అరెస్టు చేశారని ఆక్షేపించారు. ఈ కేసుల్లో సహ నిందితులుగా ఉన్న శరత్‌చంద్రారెడ్డి, మాగుంట రాఘవరెడ్డికి బెయిల్ లభించిందని, ఆ తర్వాత వారు అప్రూవర్లుగా మారి కవితకు వ్యతిరేకంగా వాంగ్మూలాలు ఇచ్చారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికల బాండ్ల రూపంలో బీజేపీకి శరత్‌చంద్రారెడ్డి రూ.55 కోట్లు చెల్లించారని, మాగుంట రాఘవ తండ్రి శ్రీనివాస్‌రెడ్డి (ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఆదేశాలతో కవితను కలిశానని వాంగ్మూలం ఇచ్చిన వ్యక్తి) ఎన్డీఏ తరఫున ఏపీ నుంచి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారని వివరించారు. కవిత విషయంలో మహిళల హక్కులను కాలరాసేలా దర్యాప్తు అధికారులు వ్యవహరించారని, దీంతో మహిళలను విచారించే విషయంలో స్పష్టత కోసం సీఆర్పీసీలోని అంశాలను లేవనెత్తుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. దీనిపై విచారణ సందర్భంగా కవితపై కఠిన చర్యలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు ఈడీ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. కవిత పిటిషన్ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగానే ఆమెను ఈ కేసులో నిందితురాలిగా పేర్కొంటూ సీఆర్పీసీ 41(ఏ) సెక్షన్ కింద సమన్లు జారీ చేశారని, అప్పటివరకు సాక్షిగా ఉన్న కవితను నిందితురాలిగా ఎందుకు మార్చారో తెలియదని అన్నారు. కవిత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగుతుండగానే ఈ ఏడాది మార్చి 15న ఈడీ అధికారులు ఆమె ఇంటిలో ఉన్నారని, నిబంధలకు విరుద్ధంగా అదే రోజు ఆమెను అరెస్ట్ చేశారని గుర్తుచేశారు. అన్ని వివరాలను పరిశీలించి ఆమెకు బెయిల్ మంజూరు చేయాలని ఢిల్లీ హైకోర్టుకు విజ్ఞప్తి చేశారు.

ఆర్డర్ కాపీ కూడా ఇవ్వలేదు..

జ్యూడీషియల్ కస్టడీలో ఉన్న కవిత విచారణ, అరెస్ట్ విషయాల్లో సీబీఐ చట్టవిరుద్ధంగా వ్యవహరించిందని విక్రమ్ చౌదరి వాదించారు. సీఆర్పీసీ నిబంధనల ప్రకారం కవితను సీబీఐ ప్రశ్నించాలంటే ఆమె వాదనను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉన్నదని, అదేమీ లేకుండానే కవితను విచారించేందుకు దిగువ కోర్టు సీబీఐకి అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. కవితను అరెస్ట్ చేసేందుకు సీబీఐ ప్రయత్నించిందని, కనీసం తమకు అప్లికేషన్ కూడా ఇవ్వలేదని కోర్టు దృష్టికి తెచ్చారు. మరుసటి రోజు స్పెషల్ జడ్జి విచారణ జరిపి కవిత అరెస్ట్‌కు ఆదేశాలు ఇచ్చారంటూ విక్రమ్ చౌదరి తన వాదనలను ముగించారు. దీంతో సీబీఐ, ఈడీ మంగళవారం తమ వాదనలు వినిపించనున్నాయి. అందుకు మధ్యాహ్నం 12 నుంచి 1.15 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తున్నట్టు జస్టిస్ స్వర్ణకాంత శర్మ తెలిపారు.

అరుణ్ రామచంద్ర పిళ్లెకి చుక్కెదురు

ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ హైకోర్టు తన మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ నిందితుడు అరుణ్ రామచంద్ర పిళ్లె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 16న హైకోర్టు ఇచ్చిన తుది ఉత్తర్వులను కొట్టివేయాలని కోరారు. హైకోర్టు ఉత్తర్వులను తాము పరిగణనలోకి తీసుకోలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది

జూలైలో తీర్పు

కవిత తరపున ఢిల్లీ హైకోర్టులో విక్రమ్ చౌదరి వాదించిన తీరును జస్టిస్ స్వర్ణకాంత శర్మ ప్రశంసించారు. ఈ కేసులో తాము ఇచ్చే తీర్పు ఎలా ఉన్నప్పటికీ విక్రమ్ చౌదరి చాలా చక్కగా వాదనలు వినిపించారని జడ్జి అభినందించారు. మంగళవారం దర్యాప్తు సంస్థల వాదనలు ముగిశాక కవిత పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేస్తామని, జూలైలో కోర్టు సెలవుల కంటే ముందే ఆ తీర్పును వెలువరిస్తామని జస్టిస్ స్వర్ణకాంత శర్మ స్పష్టం చేశారు.

అమెరికాలో తెలంగాణ యువతి మృతి

యాదగిరిగుట్ట, మే 27 : అమెరికాలోని ఫ్లోరిడాలో సంభవించిన రోడ్డు ప్రమాదంలో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణంలోని యాదగిరిపల్లికి చెందిన ఓ యువతి మృతి చెందింది. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకున్నది. గుడ్ల కోటేశ్వర్‌రావు, బాలమణి దంపతుల కూతురు సౌమ్య (25) అమెరికాలోని ఫ్లోరిడాలోగల అట్లాంటిక్ యూనివర్సిటీలో ఎంఎస్ పూర్తి చేసింది. ఉద్యోగ ప్రయత్నంలో భాగంగా ఆమె అక్కడే ఓ కన్సల్టెంట్ వద్ద శిక్షణ పొందుతున్నది. విద్యార్థి వీసా కింద ఆరు నెలల క్రితం యాదగిరిగుట్టకు వచ్చి నెలరోజులపాటు ఇక్కడే ఉన్నది. ఈ నెల 11వ తేదీన 25వ పుట్టిన రోజు వేడుకలను ఫ్లోరిడాలోనే జరుపుకొన్నది. వచ్చే నెలలో ఇంటికి తిరిగి రావాలని భావించింది. ఇంతలోనే ఆదివారం రాత్రి ఫ్లోరిడా పట్టణంలో కూరగాయలు తీసుకునేందుకు బయటకు వెళ్లి తిరుగు ప్రయాణంలో రోడ్డుపైకి రాగానే వెనుక నుంచి వచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. సౌమ్య మృతదేహాన్ని వెంటనే తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని భారత రాయబారిని ఆమె తండ్రి కోటేశ్వర్‌రావు విజ్ఞప్తి చేశారు. యాదగిరిపల్లిలో చిన్న కిరాణా వ్యాపారం చేసుకుని జీవిస్తున్నామని, తమకు ఆస్తులు లేవని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమ కూతురి మృతదేహాన్ని తమకు అప్పగించాలని వేడుకున్నారు. కాగా సౌమ్య మృతి చెందడంతో యాదగిరిపల్లిలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

పోలీసు పెట్రోలింగ్ వాహనం చోరీ

ఇటిక్యాల, మే 27: పోలీసు పెట్రోలింగ్ వాహనాన్ని చోరీ చేసిన ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాలలో సోమవారం చోటుచేసుకున్నది. ఇటిక్యాలలోని 44వ జాతీయ రహదారి యాక్తాపురంశివారులో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఆదివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న ఓ ద్విచక్ర వాహనదారుడు రోడ్డుకు అడ్డంగా బైక్‌ను ఆపడంతో ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు బైక్‌ను పక్కకు జరిపి ట్రాఫిక్ సమస్య లే కుండా చూశారు. దీంతో అతడు పెట్రోలింగ్ వాహనాన్ని చోరీ చేశాడు. తర్వాత కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో రోడ్డు పక్కన వదిలేశాడు.

బెరైటీస్ గుట్టలను పరిరక్షిస్తాం

- అందుకోసం ప్రత్యేక రక్షణ చర్యలు
- మైనింగ్, అటవీ అధికారుల వెల్లడి

గార్ల మండలంలోని బెరైటీస్ గుట్టలను పరిశీలిస్తున్న అధికారులు

మహబూబాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం కోట్యానాయక్ తండా, శేరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని బెరైటీస్ గుట్టలను మైనింగ్ శాఖ ఏజీ నిరంజన్ ఆధ్వర్యంలో అటవీశాఖ, మైనింగ్ శాఖ అధికారులు పరిశీలించారు. సోమవారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన 'తెలంగాణ ఖనిజం ఆంధ్రాకు.. మానుకోటలో ఆగని బెరైటీస్ అక్రమ రవాణా' కథనానికి అధికారులు స్పందించారు. ఆంధ్రాకు తరలించేందుకు అప్పటికే సిద్ధంగా ఉన్న ఖనిజ కుప్పలను అధికారులు గుర్తించారు. ట్రాక్టర్లు, జేసీబీ యంత్రాలు లోపలికి వెళ్లకుండా పెద్ద పెద్ద కందకాలు తీయడంతో పాట